

# మళ్లీ జన్మకైనా

ఎ. బి. వి. నరసింహారావు

అప్పుడే ఆ గదిలోకి అడుగు పెట్టిన జోగినాథం నిశ్చేష్టుడయ్యాడు. హఠాత్తుగా కొన్ని వందల సూర్యులు ఒక్క పావునిమిషంపాటు ప్రచండంగా వెలిగినట్లనిపించింది అతనికి. అతనిలో రక్తప్రసారం కొద్ది సెకనులపాటు నిలిచిపోయినట్లయింది ... ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని అలాగే చూడసాగాడు జోగినాథం.

నిజానికి జోగినాథం అలా అప్రతిభుడు కావడానికి అతని ముందు కొన్నివందల సూర్యులు కాదుకదా, ఆ గదిలో ఒక్క సూర్యకిరణమైనా లేదు. జరిగిందల్లా తన సౌందర్యానికి మెరుగులు దిద్దుకుంటూన్న నీలవేణి జోగినాథం అడుగుల చప్పుడు విని అద్దం ముందునుంచి ఒయ్యారంగా వెనక్కి తిరిగింది. అలా తిరిగి అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

అప్పటికి నీలవేణి మేకప్ ఇంకా ప్రారంభదశలోనే ఉంది. ప్రయత్నపూర్వకంగా, నిర్లక్ష్యంగా భుజంమీదికి లాక్కున్న పైటచెంగు జోగినాథాన్ని చూసి సిగ్గుపడ్డట్లుగా త్వరగా జారిపోయింది. ఉల్లిపొరలాంటి స్లీవ్‌లెస్ జాకెట్‌లోనించి బ్రాసరీ స్పష్టంగా కనిపిస్తూంది లావుకళ్లద్దాల జోగినాథానికి.

డ్రెస్సింగ్ టేబిల్‌మీద పరుచుకొని ఉన్న రకరకాల అలంకరణ సామగ్రి అంతా నీలవేణి స్పర్శ కోసం తహతహలాడుతూంది. మతారంగా పౌడరు వేలిలోకి తీసుకుంటూ ఆప్యాయపూర్వకంగా, మెరుపు మెరిసినట్లుగా నవ్వి అంది నీలవేణి:

“రా, పంతులూ! అక్కడే నిలబడిపోయావేం?”

ఆ మాటలు వినిపించనట్లే ఉండిపోయాడు జోగినాథం. మరొకరైతే కోటి వీణలు ఒక్కసారిగా పలికినట్లున్న ఆ స్వరానికి చలించిపోయేవారే.

“విన్నే, పంతులూ! రా, ఈ మంచంమీద కూర్చో.”

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!
DOL-327 TEL




ప్రపంచ
ప్రఖ్యాతం చర్మ రక్షణకు




2 సైజులలో లభిస్తుంది.

కుటికురా ఆయింట్‌మెంట్ పులిపిడి కాయలను మొటిమలను కలిగించే సూక్ష్మ క్రిములను నాశనం చేస్తుంది; దానిలోని బాగా లోతుకు చొచ్చుకొనిపోయే గుణం గల యాంటిసెప్టిక్ తైలాలు కోతలకు, గాయాలకు, కాలిన పుండ్లకు, పురుగు కాట్లకు, పగిలిన లేక విరవిరలాడే చర్మానికి, తీట, గజ్జి మొదలగు చర్మవ్యాధులకు సత్వర ఉపశమనం కలిగిస్తాయి; అదే సమయంలో పునరుజ్జీవనం కలిగిస్తూ చర్మ ఆరోగ్యాన్ని యథాస్థితికి చేరుస్తుంది.

కుటికురా
ఆయింట్‌మెంట్

JAISONS

మంచంవేపు ఒయ్యారంగా చేయి జాపి అంది నీలవేణి.

జోగినాథం మెల్లిగా కదిలి ఆ మంచంవేపు నడిచాడు. అతని కీ రోజు అక్కడంతా ఏదో కొత్తగా ఉన్నట్లనిపించింది. అప్పటిదాకా ఆ గదినంతటినీ రాజ్యమేలుతున్న సువాసనలు ఒక్కసారిగా జోగినాథాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. హఠాత్తుగా మత్తులో తేలిపోతున్నట్లయింది జోగినాథానికి.

జోగినాథం ఆ మెత్తటి పరుపులమంచంమీద ఓ వారగా ఒదిగి కూర్చున్నాడు. నీలవేణి మరోసారి అతనివేపు చూసి నవ్వింది. గదిలోని నీలంరంగు బార్‌లైటు విరజిమ్ముతున్న వెలుతురులో నీలవేణి విచిత్రంగా మెరిసిపోతూంది. అందమైన ఆ నొక్కు నొక్కుల జుట్టు, దోసగింజ ఆకారంలో ఉన్న ఎర్రటి బొట్టు, తీర్చిదిద్దినట్టున్న వంగిన ధనువుల్లాంటి కనుబొమలు, వాటికింద మెరుస్తూన్న చేపల్లాంటి కనుదోయి, తాకితే కందిపోయేలా ఉన్న చెక్కిళ్ళు, అందమైన చిన్న ముక్కు, ఆకులు గొల్పే ఎర్రటి పెదాలు, చెక్కినట్లున్న చిన్న గడ్డం—ఓహ్! ఈమెను తను దాదాపు ప్రతి రోజూ చూసే నీలవేణేనా? జోగినాథానికి అనుమానం వేసింది. తను కల కంటున్నాడా? లేకపోతే నీలవేణి మేడ అనుకుని మరో మేడలోకి వచ్చాడా తను? అతను చుట్టూ చూశాడు. సందేహం లేదు. ఇది నీలవేణి ఇల్లే. అదే మంచం, తాను మొన్న చూసిన ఆ కొత్త సిల్కుకర్టెన్, గోడలకు అక్కడక్కడ తగిలించి ఉన్న ఆ శృంగారచిత్రాలు—అవును, సందేహం లేదు. ఇది నీలవేణి ఇల్లే. . .

అప్పటివరకూ చేతిలో ఉన్న సంచిని పదిలంగా మంచంమీద పక్కగా పెట్టాడు జోగినాథం. అప్రయత్నంగా అతని దృష్టి మంచానికి పక్కనే అమర్చి ఉన్న అద్దంమీద పడింది. అందులోని తన ప్రతిబింబాన్ని విమర్శనాపూర్వకంగా చూసుకున్నాడు జోగినాథం. బాగా పెరిగిపోయిన గడ్డం, మీసాలు—తన జీవితంలోని కష్టాలు, తీరని ఆశల కలయికల్లా నలుపు తెలుపు రంగులలో...ఓహ్! ఏం అందంగా ఉంది! అతని మనస్సు హేళనగా నవ్వింది.

జోగినాథానికి తన మనస్సుపైన విపరీతంగా కోపం వచ్చింది. లేకపోతే ఏమిటి మనస్సు? తనతోపాటే ఇన్ని ఏళ్ళుగా పెరిగి పెద్దదయి, ఈ రోజు తననే హేళన చేస్తుందా, తిన్నఇంటి వాసాలు లెక్కపెట్టినట్లు!

లోతుకు పీక్కుపోయిన అతని ప్రతిబింబంతాలూకు కళ్లలో అతనికి వచ్చిన కోపం కనిపించింది లీలగా. ఈసారి జోగినాథం దృష్టి తన తలమీద పడింది. ప్రతిరోజూ తమ వీథికి అడుక్కుతినేందుకు శంఖు ఊదుతూ వచ్చే సన్యాసి తలను గుర్తుకు తెచ్చింది అతని మనస్సు. అసహనంతో పళ్ళు కొరుక్కున్నాడు జోగినాథం. ఆ తరవాత అతని దృష్టి తన బట్టలపైకి వెళ్లింది. బాగా నలిగి, మాసిపోయిఉన్న పొడుగుచేతుల చొక్కా...ఓ అరక్షణంపాటు తనమీద తనకే జాలివేసింది. జోగినాథం తల వంచుకునే, నద్దముకుంటూనే కళ్ల చివరలనుంచి నీలవేణి వేపు చూశాడు. సెంటువాసనతో ఘుమఘుమ లాడుతూంది నీలవేణి లేతనీలంరంగు సిల్కు చీర, గదిలోని నీలంరంగు వెలుతురులో మెరుస్తూ.

మరుక్షణంలో అతనికి తన ప్రయోజకత్వంపైన విపరీతమైన కోపం వచ్చింది. ఉత్తరక్షణంలోనే అతనికి

కొందరు కటిక దారిద్ర్యం అనుభవిస్తూ కూడా, భార్యా బిడ్డలను అమితంగా ప్రేమి స్తుంటారు. రంత ... నిలిచినా వారి మనసు చెదరదు. ధనరాసులు కనిపించినా విగ్రహం కోల్పోరు. వారి ప్రేమ చూచి, అది లేనివారు బెంగపడతారు. కేవలం డబ్బు, అందం ప్రేమానురాగాలను సమకూర్చి పెట్ట లేవు. ఈ జన్మకు కాకపోతే మరో జన్మకైనా తనను అమితంగా ప్రేమించే పురుషుడు లభించాలని ప్రతి స్త్రీ కోరుకుంటుంది. ప్రేమ రాహిత్యంలో స్త్రీ బ్రతకలేదు.

జాలి, సానుభూతి కలిగాయి. తనమీద కాదు, ఎప్పుడూ మంచంలో మూలుగుతూ ఉండే భార్యమీద, తన అయిదుమంది సంతానంమీద. జోగినాథం ఓ క్షణం సేపు ఆలోచించాడు, వాళ్ళ తన నెలా భరిస్తున్నారా అని. అన్నిటికీమించి నీలవేణి తన నెలా సహిస్తుందా అని ఆశ్చర్యపోయాడు జోగినాథం.

"ఏమిటి, పంతులూ! ఈ రోజు అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు?"

సిగలో మల్లెలను సర్దుకుంటూ జోగినాథం దగ్గిరగా వస్తూ అంది నీలవేణి. నీలవేణి వేపు చూసి 'మల్లెలు మరీ ఎక్కువగా పెట్టుకుంది' అనుకున్నాడు జోగినాథం. మబ్బులమధ్య మెరుపులా ఉంది నీలవేణి.

ఏం లేదన్నట్లు తల తిప్పాడు జోగినాథం నవ్వడానికి ప్రయత్నిస్తూ. నీలవేణిని చూస్తున్నకొద్దీ అతని మనస్సు మాత్రం ఇంకా ఇందాకా అద్దంలో ప్రతిబింబించిన ఆకారాన్ని గురించే ఆలోచిస్తూంది.

వంటమనిషి కాబోలు పళ్ళెంలో ఏవేవో తినుబండారాలు పెట్టుకుని తీసుకువచ్చి మంచం పక్కనే ఉన్న టేబిలు మీద ఉంచి వెళ్ళిపోయింది. ఆ పదార్థాలను చూసేసరికి అంతవరకు విపరీతంగా ఆకలివేస్తున్న సంగతి ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది జోగినాథానికి.

పళ్ళెంలోని జిలేబీని ఒక దానిని తీసుకుని జోగినాథానికి అందించింది నీలవేణి ఆప్యాయంగా. జిలేబీ తీసుకునేందుకు కొద్దిగా వంగిన ఆమె పైట జారిపోవడం జోగినాథం గమనించాడు, గుండెలకిందుగా కట్‌చేసిన ఆ జాకెట్... అతని నరాలన్నీ జివ్వుమన్నాయి ఓ క్షణంసేపు. నీలవేణి చిరునవ్వు నవ్వుతూంది. ఎర్రని ... పెదాలు వింతగా మెరుస్తున్నాయి.

అప్రయత్నంగానే ఆవిడ అందించే జిలేబీని అందుకున్నాడు నోటితోనే జోగినాథం సరసుడిలా. నీలవేణి కళ్ళు వింతగా మెరిశాయి. నీలవేణి మరో జిలేబీ అందించబోయింది. ఈసారి జోగినాథం చేత్తో అందుకున్నాడు. ఆమె సుకుమారమైన, సున్నితమైన వేళ్ళు అతనిలో తీయని ఊహలు రేపాయి. అయితే మరుక్షణంలోనే జోగినాథం తనను తాను నిగ్రహించుకున్నాడు. ఆ సంగతి నీలవేణికీ తెలుసు.

"ఏమిటిదంతా, వేణీ! ఈ రోజు ఏమైనా పండగా!" జోగినాథం గొంతుకూడా అతని జీవితంలాగే వంగిపోయి బొంగురుగా వినిపించింది.

నీలవేణి సమాధానంగా నవ్వింది, కొన్నివేల తెల్లటి, స్వచ్ఛమైన ముత్యాలు కురిసినట్లు.

క్షణాలు, నిమిషాలు దొర్లిపోయాయి. పళ్ళెంలోని పదార్థాలలో సగానికిపైగా ముగించాడు జోగినాథం. నీలవేణి అందించిన చల్లటి మంచినీళ్లను రెండు గ్లాసులకు పైగా గడగడ తాగేసి విశ్రాంతంగా, అతని మనస్సుకు హాయిగా తేన్చాడు.

అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి. ఎంత పాపిష్ఠివాడు తను? అవతల భార్య మంచంలో మూలుగుతూంటే, ఆకలికి పిల్లలు ఏడ్చి ఏడ్చి మంచినీళ్లతో కడుపు నింపుకుని సొమ్మసిల్లి పడిఉంటే, తాను మాత్రం మెత్తటి పరుపుల మంచంమీద కూర్చుని రంభలాంటి నీలవేణి అందించిన ఫలహార మంతా కడుపునిండా తిన్నాడు! ఛీ! ఛీ! తనదీ ఓ బ్రతుకేనా? తనమీద తనకే అసహ్యం, కోపం, ఏవగింపు కలిగాయి. వెంటనే అక్కడినుంచి పారిపోదా మనిపించింది. అయితే చిత్రం! మంచంమీదనుంచి లేవడానికైనా ప్రయత్నించలేకపోయాడు! ఏమిటిది?

నీలవేణి అనునయంగా అతని భుజంమీద చేయి వేసి, కొంచెం దగ్గిరగా జరిగి అంది:

"ఏదైనా మాట్లాడు, పంతులూ! ఏమిటీ రోజు బెల్లంకొట్టిన రాయిలా అయిపోయావు?"

నీలవేణి మాటల్లోని ప్రేమ, ఆమె స్పర్శలోని హాయి జోగినాథానికి ఓ క్షణంసేపు మత్తు కలిగించాయి. అతనేమీ జవాబివ్వలేదు.

"ఈ రోజు మీ ఆవిడకు ఎక్కువగా ఉందా?" నీలవేణి మాటల్లో అదే అనురాగం.

జోగినాథం కొంచెం చిరాకుపడ్డాడు, నీలవేణి ఈ సమయంలో తన ఇంటి విషయాలు గుర్తు తెస్తున్నందుకు.

తన కళ్ళలోకే చూస్తున్న ఆమె కళ్ళలోకి చూశాడు అతను. ఆ కళ్ళలోంచి ఏదో భవిష్యత్తు కనిపిస్తూంది, అంతా బంగారురంగులో. ఎవరో తనను పిలుస్తున్నారు చేయిజాపి. అయితే ఆ వ్యక్తి నీలవేణి కాదు, తన భార్య. జోగినాథం చూపులు మళ్ళించాడు.

"లేదు... అలాగే ఉంది..." ప్రయత్నంమీద జవాబిచ్చాడు అతను.

"మరెందు కలా ఉన్నావు... ఒంట్లో నొప్పిగా ఉందా?" ఆమె చేయి అతని నుదురుని స్పృశించింది పరీక్షగా.

"ఆహా... లేదు." అతను మరోసారి నవ్వడానికి ప్రయత్నించాడు. అతని జవాబు చాలా సాధారణంగా ఉంది. నీలవేణి కొంగు తగిలితే చాలనుకుంటారు చాలామంది కలిగినవాళ్ళు ఆ ఊళ్ళో. ఆమె చేయి తగిలీ తగలగానే ఏవో మధురానుభూతులతో తేలిపోయి, మరేదో లోకంలో విహరిస్తారు, అంత భాగ్యం కలిగిన కొంతమంది. కాని జోగినాథం మాత్రం మరేదో లోకానికి పోలేదు సరికదా, అణుమాత్రమైనా చలించలేదు.

తరవాత చాలాసేపు గడిచిపోయింది. అంతసేపూ నీలవేణే ఏదేదో మాట్లాడింది. ఊరికే అక్కడినుంచి వెళ్ళిపోవాలని చాలాసార్లు అనుకున్నాడు కాని, కదలలేక పోయాడు బంధితుడైనట్లుగా జోగినాథం.

హఠాత్తుగా అతను లేచి నిలబడ్డాడు. మంచం మీద పెట్టిన సంచీ తీసుకుని, "వస్తా, వేణీ!" అంటూ ముందుకు నడిచాడు ఆమె అంగీకారంతో ప్రమేయం లేనట్లుగా.

అతను కంద గేటు దాటి వెళ్ళిపోవడాన్ని మేడపై నుంచి చూసింది ఆమె. అతను కనుమరుగైపోయిన తరవాత ఏదో తెలియని బాధతో ఆమె మనస్సు మెలికలు తిరిగిపోయింది.


* * *

కలలోకూడా అనుకోని సంఘటనలు కొన్ని చాలా మంది జీవితాల్లో జరిగిపోతూంటాయి. ఒక పేద

జయలక్ష్మి భర్త డాక్టరు. ఆవేళ ఊళ్ళో కొత్త సినిమా విడుదలఅయింది. పోయి చూద్దాం — అని భార్య కోరగా ఆయన హాస్పిటల్‌కి పోయిన తరవాత కబురు చేస్తానన్నాడు.

అలాగే మధ్యాహ్నం కాంపౌండరు చేత భార్యకు ఒక చీటి పంపారు డాక్టరు. ఎంత బాధపడినా భర్తగారు వ్రాసినదేమిటో జయలక్ష్మికి అర్థం కాలేదు. ఇంటికి ఎదురుగా ఉన్న మందుల దుకాణానికి వెళ్ళి ఆ దుకాణం యజమానిని చీటి చదవ మన్నది.

అతను దానికేసి చూసీ చూడ్డంతోటే "ఈ ఇంజక్షన్ రెండున్నయ్!" అన్నాడు.



చిత్రం — రుక్మిణి (డోర్నకల్)

ఉపాధ్యాయుడు, ఎప్పుడూ కుక్కిమంచంలో మూలుగుతూ ఉండే భార్యయొక్క భర్త, అయిదుగురు పిల్లల తండ్రి అయిన జోగినాథానికి, కార్లలో వెళ్లినా కళ్లకు కనిపించడం అసాధ్యమయిన నీలవేణికీ పరిచయం కావడం, అది అంతటితో ఆగిపోకుండా వృద్ధిచెందడమూ, దాదాపు ప్రతిరోజూ బడికి వెళుతున్నంత తేలికగా నీలవేణి మేడకు జోగినాథం వెళ్లి రావడమూ ఎవరూ ఊహించలేని విషయాలు.

ఆ ఊరికి పక్కనే ఉన్న ఊళ్లో దాదాపు రెండేళ్ల కిందట ఏవో ఉత్సవాలు జరిగాయి ఆర్భాటంగా. ఆసక్తి లేకపోయినా ఇంట్లో పిల్లల గోల భరించలేక పెద్దపిల్లలిద్దర్నీ తీసుకుని ఆ ఉత్సవాల్ని చూసేందుకు ఓ పూట వెళ్లాడు జోగినాథం. సరిగ్గా ఆ సాయంత్రానికి ప్రళయం వచ్చినంత ప్రచండంగా గాలివాన రావడంతో ఉత్సవాల దారిది ఉత్సవాలదీ, జనం దారిది జనందీ అయిపోయింది. ఆ సమయంలో జోగినాథం తన ఇద్దరి పిల్లలతో ఎంతో శ్రమమీద ఓ శిథిలమై పోయిన ఇంటితాటాకు పడిపోబోయే పంచలోకి చేరగలిగాడు. బయట హోరున గాలి వాన. పంచనుకూడా వదిలిపెట్టలేదు. అయినా అంతకుమించి వేరే గత్యంతరం లేకపోయింది. బయట ఎక్కడా చిన్న లాంతరు వెలుగు కూడా కనిపించటంలేదు.

ఆకలి, నిద్ర అంటూ గొడవ పెడుతున్న పిల్లలిద్దరికీ నాలుగు తగిలించాడు ఓర్మి నశించిన జోగినాథం. అతని మనస్సంతా ఇంటిదగ్గిర మంచంలో ఉన్న భార్యమీద కేంద్రీకృతమయింది ఆ సమయంలో. అంతా సవ్యంగా జరిగిఉంటే మరో గంటకల్లా ఇంటికి చేరగలిగి ఉండేవాడు.

సరిగ్గా అదే సమయంలో తడిసి ముద్దయిపోయిన ఓ అయిదారేళ్లమ్మాయి హఠాత్తుగా పరిగెత్తుకు వచ్చి జోగినాథాన్ని వాటేసుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది. చీకట్లో ఆ అమ్మాయెవరో స్పష్టంగా తెలియలేదు జోగినాథానికి. ఎంత అనునయంగా ప్రశ్నించినా ఆ అమ్మాయినుంచి ఏడుపు తప్ప మరో సమాధానం అతనికి లభించలేదు. బయట గాలివాన ఉధృతం విపరీతంగా హెచ్చిపోయింది. వర్షపుజల్లు విసిరికొడుతూంది. పంచలోకూడా పెంకులు చెదిరిపోయిన ప్రాంతం అంతా నీటిమయమయిపోయింది. జోగినాథానికి ఎటూ పాలుపోలేదు. ఎంతోసేపు ఎంతగానో నచ్చచెప్పినమీదట ఆ అమ్మాయి ఏడుపు మానింది. పిల్లలిద్దరితో పాటు ఆ అమ్మాయినికూడా వర్షపుజల్లు తక్కువగా కొడుతూన్న భాగంలో పడుకోపెట్టి తన పై కండువా తీసి కప్పాడు. కొద్దిసేపట్లోనే పిల్లలు ముగ్గురూ నిద్రపోయారు. జోగినాథం మాత్రం ముగ్గురికీ కావలా లా చీకట్లోకి, కురుస్తూన్న వానలోకి చూస్తూ ఆ రాత్రి గడిపాడు.

తెల్లవారడంతోపాటుగా వాన వెలిసిపోయినా గాలి జోరుమాత్రం తగ్గలేదు. ఆ అమ్మాయిని పరిశీలనగా చూసిన జోగినాథానికి గుండె ఎగిరి గొంతులోకి వచ్చినట్లయింది. ఆ అమ్మాయి ఒంటిమీద ఎన్నో విలువైన నగలున్నాయి. ఈ అమ్మాయిని ఎవరికని అప్పగించాలి? నోరు తెరిచి ఒక్క మాటకూడా మాట్లాడకుండా బెదురుచూపులు చూస్తూంది ఇంకా ఆ అమ్మాయి.



నీడా జాడా
ఫోటో—పి. జి. ఎస్. రెడ్డి (నెల్లూరు)

ముగ్గురు పిల్లల్ని వెంటపెట్టుకుని జోగినాథం నాలుగు రోడ్ల కూడలికి వచ్చేసరికి, బురదనీళ్లను చిమ్ముకుంటూ ఓ పెద్ద కారు వచ్చి ఆగడమూ, అందులోంచి ఓ రంభలాంటి ఆవిడ దిగడమూ, "అక్కయ్యా" అంటూ తప్పి వచ్చిన ఆ అమ్మాయి ఆమెను వాటేసుకోవడమూ జరిగాయి. తన సమస్య ఇంత త్వరగా, తేలిగ్గా తేలిపోవడం ఊహించని జోగినాథం ఆశ్చర్యపోయాడు.

ఆ అక్కయ్యే నీలవేణి. . . అంత సొమ్ముతోఉన్న ఆ అమ్మాయిని ఆదరంగా కాపాడిన అతనికి ఎలా కృతజ్ఞత వెల్లడించుకోవాలో తెలియక సతమతమై పోయింది ఆమె.

"మీ పేరేమో నాకు తెలియదు. నన్ను క్షమించండి. ఈ అమ్మాయి మా బంధువులమ్మాయి. రాత్రి గాలిదుమారంలో తప్పిపోయింది. రాత్రంతా గాలిస్తూనే ఉన్నాం. మా పిల్లను ఇంత జాగ్రత్తగా కాపాడి మా కప్పగించారు మీరు. మా వల్ల మీ కెంతో శ్రమ. . ."

"అబ్బే, ఇందులో శ్రమేముంది?" నీలవేణి మాటలను సగంలోనే అందుకుంటూ అన్నాడు జోగినాథం, పిల్లలిద్దరితో ముందుకు సాగబోతూ.

నీలవేణి కార్లోంచి పెద్ద హాండ్ బాగ్ తీసి అందులోనించి వందరూపాయల కాగితాలు తీస్తూ, "ప్రస్తుతానికి ఇంతకంటే ఎలా మీ ఋణం చెల్లించుకోవాలో తోచటం లేదు. మరోలా భావించక వీటిని . . ."

నీలవేణి మాటలు సగంలోనే ఆపేసింది.

జోగినాథం ఆ కాగితాలవేపు, ఆమె వేపు మార్చి మార్చి చూశాడు.

"డబ్బుతో సాధించలేనిదికూడా కొంత ఈ లోకంలో ఉందని మీరు గ్రహించలేరూ!"

ఆ తరవాత. . . ఊర్లూ, పేర్లూ తెలిశాయి. ఇద్దరూ ఒకే ఊరివాళ్లం అని తెలిసేసరికి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

అలా జరిగిన పరిచయం ఏకవచనంలో సంబోధన వరకూ వచ్చి ఈనాటికీ నిలిచి ఉండంటే అది జోగినాథంలోని నిరాసక్తత వల్లనే.

* * *

నీలవేణికి జోగినాథం కుటుంబవిషయాలు పూర్తిగా తెలుసు.

జోగినాథం వచ్చినప్పుడల్లా తన భార్య అనారోగ్యం గురించి, మందులు గురించి, తన పిల్లలగురించి మాట్లాడుతూంటాడు. మొదట్లో అతని తరహా, అతని మాటలు ఆమెకు నవ్వు తెప్పించేవి. అతను వెళ్లిన తరవాత 'ఏమిటీ మనిషి ధోరణి?' అని అనుకునేది నీలవేణి. రానురాను అతనంటే విపరీతమైన జాలి, సానుభూతి కలిగాయి. ఎన్నో విధాల అతని మనస్సును మారుద్దామని, కాసేపయినా హాయిగా ఉండేట్లు చేద్దామని ఆమె ప్రయత్నించసాగింది. కాని, ఆమె ఎప్పుడూ ఓడిపోయేది.

* * *

నీలవేణి అప్రయత్నంగా అద్దంలోకి చూసుకుంది. . తన అందం పిసమంతయినా చెదిరిపోలేదు. . . తననుంచి అతను ఏమీ పట్టుకెళ్లలేదు. కాని, తనకు చెందినదాన్ని, అమూల్యమైనదాన్ని, రూపాయంతో లెక్కకట్టలేని దాన్ని తీసుకెళ్లాడు. మంచంమీద బోర్లపడుకుని నీలవేణి అతన్ని గురించి ఆలోచించసాగింది.

తన సమక్షంలోకూడా అతను భార్యను మరిచిపోలేడు. ఎందుకు? ఎందు కతనికి ఆ వ్యాధిగ్రస్తురాలిమీద అంత ప్రేమ? తనింత ఆరోగ్యంగా, అందంగా ఉందికదా! మరి తనమీద అంత ప్రేమ ఎవరికుంది? తను ఎవరికి కావాలి? దుకాణంలోని వస్తువులా తనను కొనుక్కోగలరు కొద్దిమంది. అంతే. తరవాత మళ్లీ ఒంటరిదై పోతుంది తను.

చాలామంది దృష్టిలో తను అందరాని పండు కాని తనకు అందనిది ఒకటి ఉండిపోయింది. అదే ఆప్యాయత, మమత, ప్రేమ. అది తనకు కావాలి ఎలా లభిస్తుంది? తన ఐశ్వర్యము తనమీద ప్రేమ చూపించగలదా? తను సంపాదించిన రూపాయలు తనమీద అనురాగాన్ని కురిపించగలవా?!

పోనీ, తనెవర్నయినా చేసుకుంటే? నీలవేణి తన ఊహకు తనకే నవ్వు వచ్చింది. తన నెవరు చేసుకుంటారు? చేసుకున్నా ఎందుకు చేసుకుంటారు? తనమీద ప్రేమ చూపించడానికి కాదు, తన ఐశ్వర్యాన్ని చేపట్టడానికే చేసుకుంటారు. జోగినాథం తన భార్యను చూసుకున్నంత ఆప్యాయంగా తనను చూసుకునేవారు తనకు కావాలి. తన అందంతో తను ఎన్నాళ్లు బ్రతగ్గలదు? డబ్బు లేకపోయినా బ్రతకవచ్చుగాని, భగవాన్! ఆదరణ, ఆప్యాయత లేకుండా ఎలా?

హఠాత్తుగా నీలవేణికి తనకు లోపించిన మమత, ఆప్యాయతలమీదికి మనసు పోయింది. అర్థంకాని ఆలోచనలతో ఆమె మనస్సు కకావికలైపోయింది.

* * *

మరునాడు రాలేదు జోగినాథం. అతను రోజు విడిచి రోజుకాని, రెండురోజుల కోసారిగాని

చేస్తూనే ఉంటాడు. అయినా ఆ రోజు అతను రాకపోయేసరికి నీలవేణి విలవిల్లాడిపోయింది. 'ఇదేమిటే, అతను రాకపోతే తను ఉండలేకపోతూందేమిటి?' నీలవేణి ఆశ్చర్యంగానూ, బరువుగానూ నిట్టూర్చింది. అతని భార్యకు ఎక్కువ సుస్తీగా ఉందేమో? పిచ్చివాడు! ఏ డాక్టరు దగ్గరకని తీసుకెళ్లగలడు? అతనికి డబ్బు ఎక్కడిది? తనివ్వబోతే అతను తీసుకోడు.

"మన మధ్య డబ్బు ప్రసక్తి తీసుకురాకు, వేణీ! ఎవరినైనా సరే విడదీసే శక్తి దానికే ఉంది." ఓసారి జోగినాథం అన్న మాటలు గుర్తుకి వచ్చాయి.

అసలు అతన్ని గురించి తనెందుకు ఆలోచించాలి? ఎందుకు బాధపడాలి? అత నేమవుతాడు తనకు? తను అతన్నించి ఏం కాశిస్తూంది? అతనేమీ అందగాడు కాదు. పోనీ, తనకు అతనిపైన మోజు ఉన్నదనైనా అనుకునేందుకు అతనెవరు? తనెవరు? అతని కుటుంబవిషయాలు తన కెందుకు? వాళ్లంతా ఏ గంగలో కలిస్తే తనకేం?

నీలవేణి మనస్సు అతన్ని అసహ్యించుకునేందుకు ప్రయత్నించింది. అయినా అతనిని మినహాయించి ఆలోచించలేకపోయింది. అతనికీ, తనకూ ఏదో కనిపించని మానసికమైన అనుబంధం ఉన్నట్లనిపించింది నీలవేణికి.

ఆమె గుండెల్లో ఏదో కలుక్కుమన్నట్లనిపించింది. బాధగా అరచేత్తో గుండె రాసుకుంటూ ఉండి పోయింది.

* * *

మూడు రోజులు గడిచాయి.

ఆ రోజు జోగినాథం వచ్చాడు. గేట్లోనే పనిమనిషి చెప్పింది నీలవేణికి మూడు రోజులనుంచి గుండె పోటుగా ఉంటూందని, మంచంలోంచి లేవడం లేదనీను.

కింది అంతస్తులోని ముందుగదిలో పడుకుని ఉంది నీలవేణి. పక్కన ఉన్న టేబిలునిండా రకరకాల మందులున్నాయి. ఆ గదిలో అతను అడుగు పెట్టడం తోనే అక్కడ ఉన్న పనిమనిషి ఇవతలకు వచ్చేసింది. అంతవరకూ నిర్జీవంగా ఉన్న నీలవేణి కళ్లు అతని రాకతో కొత్తకాంతిని నింపుకున్నాయి.

"ఏమిటి, వేణీ! గుండెపోటు వచ్చిందటగా నీకు!' అతని కంఠంలో వినిపించిన ఆత్రతకు మనస్సులోనే మురిసిపోయింది ఆమె. అవును, తనకు కావలసింది, అతనుతప్ప మరెవ్వరూ ఇవ్వలేనిది అదే, అదే. . . ఆప్యాయత.

సమాధానంగా నవ్వేందుకు ప్రయత్నించింది.

"ఇన్ని రోజులనించి ... రాలేదేం?" ఆమె గొంతు నీరసంగా ఉంది.

"ఏం లేదు, ఊరికనే. నీ కిలా ఉందని కబురు చేస్తే వచ్చేవాడిని కాదూ!" అతని కంఠంలో బాధ ధ్వనించింది.

"నేను. . . నేను. . . కబురు చేస్తే. . . ని. . . జం ... గా ..." ఆ తరవాత ఆమె ఓ క్షణంపాటు మాట్లాడలేదు.

"అయినా. . . నేను నీకే. . . మవుతాను. . . నా కోసం. . . ఎందుకు. . . రావాలి నువ్వు?" ఏదో సమాధానం కోసం వెతుకుతూ అంది.

అతను కొద్ది క్షణాలపాటు ఏం మాట్లాడలేదు.

"నే నలా ఆలోచించలేదు, వేణీ! నిజమే, నేను నీ కేమీ కాను. అయినా నీవు బాధపడుతున్నావంటే ఎందుకో భరించలేననుకుంటా."

ఆ క్షణంలో ఆమె కళ్లు విజయం సాధించినట్లు మెరిశాయి.

"అసలే మీ ఆవిడతో. . . నీ మనసుకు. . . విశ్రాంతి లేదు. ఇంకా. . . నా వల్లకూడా. . . నువ్వు బాధపడడం. . . నా కిష్టం లేదు."

ఆ మాటకు అతను నవ్వాడు మెల్లిగా. ఆ నవ్వులో బాధ, నిస్పృహ కనిపించింది నీలవేణికి.

"బాధపడటం నాకు అలవాటేగా వేణీ! నీ వల్ల కొత్తగా వచ్చే బాధేదీ ఉండదు." తరవాత అతను ఆమె బాధ గురించి, మందుల గురించి మాట్లాడాడు.

దాదాపు ఓ గంట తరవాత లేస్తూ, "ఏవేవో ఆలోచనలు కల్పించుకుని మనస్సు పాడుచేసుకోకు. పూర్తిగా విశ్రాంతి తీసుకో. వస్తా" అన్నాడు అతను.

అతను వెళ్లిన తరవాత అతనన్న మాటలన్నీ పదేపదే వల్లె వేసుకుంది ఆమె. తనవల్ల అతనికి కొత్త బాధేదీ కలగదా! అంటే తననుకూడా అతను తనకు సంబంధించిన వ్యక్తిలానే చూసుకుంటున్నాడా! ఎంతటి అదృష్ట వంతురాలు తను!

అతనుతప్ప తన కెవరున్నారు? నీలవేణి ఆలోచిస్తూ ఉండిపోయింది. ఆమె కళ్లముందు తను బంధువులనుకునేవాళ్లు మసకమసకగా కదిలిపోయారు. జోగినాథం మూర్తిమాత్రం స్పష్టంగా నిలిచిపోయింది.

* * *

"పూజ్యులైన పంతులూ!

ఈమధ్య ఎందుకో, ఎన్నడూ లేనిది ఆదరణ, అనురాగాల కోసం నా మనస్సు తల్లడిల్లి పోతూంది. నీకు నా చరిత్ర పూర్తిగా తెలుసు. నా దగ్గరికి ఎప్పుడు వచ్చినా, నీవు నీ భార్య, పిల్లల గురించి అమిత ఆప్యాయతతో ప్రస్తావిస్తూంటావు. అలాంటి అచంచలమైన ప్రేమను నా కెవరిస్తారు?

ఈ జన్మకు నేను మీ మమతల పరిధిలోకి ప్రవేశించలేనేమో ననే అనుకున్నాను. కాని, మీరు నన్నుకూడా మీ వాళ్లలో ఒకరిగా పరిగణిస్తున్నారని గ్రహించాను. ఈ జీవితానికి నా కిది చాలు, పంతులూ! దయామయుడైన ఆ భగవంతుని ఒక్క కోరిక కోరుతున్నాను, కనీసం వచ్చే జన్మలోనైనా నాకు నీ పూర్తి అనురాగం లభించేలా చేయమని. డాక్టర్లు నాకు వచ్చిన గుండెపోటు చాలా ప్రమాదకరమైనదని అంటున్నారు. నాకు తెలిసిన లోకం అంతా కృత్రిమం. అందులో వాస్తవమైన ప్రేమ, ఆదరణ లేదు. అలాంటి లోకంలో దూరంగా నీవు, నీ అనురాగం చల్లగా నన్ను ఆహ్వానించాయి. వాటిని చేరుకునేందుకు మరో జన్మదాకా వేచి ఉండాలి. అందుకనే ఈ జబ్బు ప్రమాదకరమయినా నాకు భయం లేదు.

మరో విషయం. నా ఐశ్వర్యంపైన నీ కెలాంటి అభిప్రాయాలున్నప్పటికీ, తప్పక ఈ దీనురాలి చివరి కోర్కెను కాదనవన్న విశ్వాసంతో. . . నా సర్వస్వాన్నీ చట్టరీత్యా నీ కందేలా. . . ఏర్పాట్లు చేయించాను.

అబ్బ. . . గుండెల్లో నొప్పి విపరీతంగా వస్తూంది. ఇంకేమీ రాయలేను. సెలవు. నీ . . . వే. . .ణి."

ఆ ఉత్తరం చివరంతా జిలుగు జిలుగ్గా ఉంది. ఆ ఉత్తరం అంతా చదివి, ఎదురుగా నిర్జీవంగా ఉన్న నీలవేణిని చూసి బేలగా ఏడ్చాడు జోగినాథం. ★


వాయిదా చెల్లుబడుల మీద
ట్రాన్సిస్టర్

బజా
( గ్యారంటీతో )
3 బాండ్ల అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ రు. 5/- ల నెలసరి వాయిదాలమీద. ప్రతి పల్లెకు, పట్టణానికి పంపవచ్చును. వివరములకు:
HIND AGENCIES (55)
Kolhapur Road, Delhi-7.

మొటిమలు
మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును
నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మరంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనుడి.

అందమైన! అలంకరణకు!


అజంతా గోల్డు కవరింగ్ వర్క్సు,
చిలకలపూడి బందరు